# నాకు నచ్చిన పుస్తకం

అబ్దుల్ కలాం గారు వ్రాసిన "ఎవరికీ తలవంచకు" అనే పుస్తకం నాకు నచ్చిన పుస్తకం. కలాంగారి ఉద్దేశంలో ఎవరికీ అంటే పరిస్థితులకు అని అర్థం. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు తలవంచకుండా ఎదిరించి నిలిచిన నాడే విజయం మన సొంతమవుతుందని తన జీవితాన్నే ఒక ఉదాహరణగా చూపిన మహనీయుడు అబ్దుల్‌కలాం గారు. పేపర్‌బాయ్ నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన తన ప్రస్థానంలో తన జీవితంలో ఎదురైన ఆటుపోట్లను ఉదహరిస్తూ తాను ఎలా నిలదొక్కుకో గలిగారనేది ఆయన వ్రాసిన "ఎవరికీ తలవంచకు" అనే పుస్తకంలో క్లుప్తంగా వివరించారు.

అబ్దుల్ కలాంగారు తనను ఉత్తేజపరిచిన ఐదుగురు మహాత్ముల గురించి ఈ పుస్తకంలో ప్రస్తావించారు. వారు ప్రొ. విక్రమ్‌సారాభాయి గారు సతీష్ ధావన్‌గారు, ప్రొ. బ్రహ్మప్రకాశ్ గారు, ప్రొ. ఎం.జి.కె మీనన్‌గారు, డా. రాజారామన్న గార్లు. కలాంగారు వీరిని ఆదర్శంగా తీసుకొని వారి ఎదుగుదలకు సహకరించిన అంశాలపై దృష్టి కేంద్రీకరించారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో విశేషమైన కృషిని చేసి, "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా" అనే బిరుదును పొందారు.

కలాంగారు ఈ  పుస్తకంలో విద్యాలక్ష్యాలను, తల్లిదండ్రుల పాత్రను, పాఠశాలల పాత్రను గురించి విపులంగా వివరించారు.

అంతేగాక తనను ఎంతోప్రభావితం చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల లక్షణాలను గురించి చెప్తూ, ఉపాధ్యాయులు ఎలా ఉండాలో పరోక్షంగానే ప్రస్తావించారు. ఆయన గురువులకిచ్చిన స్థానం అటువంటిది. నేటి విద్యార్థులే భావి భారత పౌరులనేది యదార్థం. సమాజాన్ని మార్చాలంటే అది తరగతిగది నుండే ప్రారంభం కావాలనేది ఆయన ఉద్దేశం. అందుకే తన పుస్తకంలో ఉపాధ్యాయులకు పెద్దపీట వేశారు.

నాయకుడికి ఉండవలసిన లక్షణాలను గురించి, కొత్త తరహా నాయకత్వం గురించి కూడా వివరించడం జరిగింది.

'కలలు కనండి, ఆ కలలను సాకారం చేసుకోండి' అనేది ఆయన నినాదం. జీవితంలో ఎదగాలని కలలు కనాలి. ఆ కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేయాలి. సాధించుకోవాలి అని చెప్పడమే కాక ఆయన ఆచరించి చూపించారు.

**ఆత్మబలం**

ఎవరికీ తలవంచని ఆత్మబలానికి రెండు పార్శ్వాలున్నాయి. మొదటి పార్శ్వం జీవితంలో అత్యున్నత లక్ష్యాలు సాధించాలనే సంకల్పం మనకుండాలి. రెండవ పార్శ్వం, లక్ష్యాన్ని సాధించే దారిలో నీకెదురయ్యే అవరోధాలన్నిటినీ జయించగలిగే సామర్థ్యం. ఉదాహరణకు నది లేదా సరస్సు లేదా కొలను లోతు ఎంతైనా కానీ, ఆ నీళ్ళు ఎటువంటివైనా కానీ పద్మం ఆ పంకాన్ని చీల్చుకుని శోభిస్తూ ఉంటుంది. అలాగే ఏదైనా లక్ష్యాన్ని సాధించాలనే నిర్దిష్ట సంకల్పమంటూ నీకుంటే నిన్ను ముంచెత్తే సమస్యలెటువంటివి కానీ నువ్వు జయించి తీరతావు అని ఆయన తెలిపారు..

**వైకల్యం ముందు తలవంచకు**

క్రీడోత్సవాల్లో పాలుపంచుకోవడం కోసం ఢిల్లీ, వచ్చిన వికలాంగ బాలబాలికలను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానించడం జరిగింది. ఆ సందర్భంగా కలాం గారు వారిని ఉద్దేశిస్తూ చిన్న కవితను వారికి చదివి

వినిపించారు.

మనమంతా దేవుడి పిల్లలం
మన మనసులు వజ్రంకన్నా ధృడమైనవి
మన సంకల్పాలు బలమైనవి
మనం నెగ్గుతాం, నెగ్గి తీరుతాం
భగవంతుడు మనవైపున్నప్పుడు
మనకెవ్వరు ఎదురు నిలవగలరు.

అని వినిపించారు. ఈ కవిత వింటూనే ఇరాన్‌కు చెందిన ముస్తఫా అనే పిల్లవాడు కలాంగారి దగ్గరకు వచ్చాడు. అతడికి కాళ్ళు లేవు. అతడికి కృత్రిమ పాదాలు అమర్చారు. అతడు ఆయన ముందుకొస్తూనే కలాంగారి చేతుల్లో ఒక కాగితాన్ని పెట్టాడు. అందులో అతడు పారశీకంలో రాసిన అందమైన కవిత ఉంది. ఆ కవిత పేరు సాహసం

నాకు కాళ్లు లేవు, కాని
నా మనస్సు చెప్తోంది
కన్నీళ్లు అవసరం లేదని
కారణం, నేనిప్పుడొక రాజుముందు కూడా
మోకరిల్లనక్కరలేదు

ఆ కవితలో ప్రకటించిన ఆశావహ దృక్పథాన్ని, జీవితాన్ని ఆశాపూరితంగా ఎదుర్కొంటున్న అతడి సాహసాన్నీ చూసి కలాంగారు విచలితులయిపోయారు.

**<u>సంకల్పబలం :</u>**

'నీ జాతి చరిత్రలో పుటను రూపొందించినందుకు మాత్రమే నువ్వు శాశ్వత స్మరణీయుడవుతావు'

ప్రతిభావంతున్ని భౌతికలోపాలు, దోషాలు అడ్డుకోలేవు ఎందుకంటే ఏ మనిషికైనా అతడి జీవితానికొక ధ్యేయం ఏర్పరచి ముందుకు చొచ్చుకు పోవటానికి ప్రేరణ కలిగించే శక్తి అతడి లోపలినుంచే వస్తుంది కనుక. సంకల్పబలాన్ని మించిన ఆయుధం మరొకటిలేదు అందుకే కలాంగారు వికలాంగులకు ప్రేరణకలిగించేలా ఇలాంటి మాటలు చెప్పేవారు.

**<u>మనని ముందు తరాలు దేనికోసం గుర్తుపెట్టుకోవాలి:</u>**

సాధారణంగా అబ్దుల్‌కలాం ఎవరిని కలిసినా రెండు ప్రశ్నలు అడిగేవారు.

'ఇంతవరకూ నీ జీవితంలో నువ్వు నేర్చుకున్నదేమిటి?

నిన్ను ముందుతరాలు దేనికోసం గుర్తుపెట్టుకోవాలి?

ఇటువంటి ప్రశ్నలు అడగడం ద్వారా వారి జ్ఞానాన్ని అంచనా వేసేవారు.

'నిన్నూనీ జీవితాన్ని నువ్వే తీర్చిదిద్దుకోవాలి' అని ఎల్లప్పుడూ తెలిపే జిజ్ఞాసి

సత్యనిష్ఠ, అకుంఠిత దీక్ష, ధర్మపరాయణత్వం, మానవతా విలువలు కలిగిన నిరంతర శ్రామికుడు, అపర భగీరథుడు అయిన అబ్దుల్ కలాంగారి జీవితం నాకు ఆదర్శం.